సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 17 । జూన్ । 2023



సంసద్ ఆదర్శ్ గ్రామయోజనకు.... ఐదు గ్రామాల ఎంపిక

సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమం క్రింద పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐదు గ్రామాలను దత్తత గ్రామాలుగా ఎంపిక చేశారని ఎంపీ మాధవి తెలిపారు. - 8లో



న్యాయవాదుల క్రికెట్ టోర్నీ

అంతర్ జిల్లా న్యాయవాదుల క్రికెట్ టోర్నీకి జిల్లా న్యాయవాదుల సంఘానికి చెందిన 16 మంది క్రీడాకారులు శుక్రవారం విశాఖ బయల్దేరారు. - 8లో



పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్విని యోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జేసీ విశ్వేశరరావు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

గిరిజన సంక్షేమశాఖ డీడీగా శ్రీనివాసరావు



డీడీకి ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీగా శ్రీనివాసరావును నియమిస్తూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పని చేసిన సహకార శాఖకు చెందిన డీడీ నగేష్ (ఎఫ్ఏసీ) మెడికల్ లీవ్‌పై వెళ్లిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సీనియర్ ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావుకు డీడీ బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఆయన విధుల్లో చేరారు.

గృహ నిర్మాణాలకు ఇదే అనుకూల సమయం : పీవో



పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు: గృహ నిర్మాణాలకు ప్రస్తుతం అనుకూల సమయమని ఐటీడీఏ పీవో, హౌసింగ్ సాలూరు ప్రత్యేకాధికారి విష్ణుచరణ్ అన్నారు. మున్సిపాలిటిలో గుమడాం లే అవుట్ వద్ద గృహ నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత సమయం ఇళ్ల నిర్మాణాలకు అనుకూలమని లబ్ధిదారులకు అవగాహన పెంపొందించాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో నాడు – నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శంకరరావు తదితరులు ఉన్నారు.

పక్కాగా ఓటరు జాబితా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇతర అధికారులు

పార్వతీపురం: ఓటరు జాబితా పక్కాగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఓటరు జాబితా అంశాలపై కలెక్టర్లు, ఓటరు నమోదు అధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా తయారీలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జెండర్ రేషియో, జనాభా రేషియో ప్రాతిపదికన నిశితంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఓటరు జాబితాను తయారు చేయడం జరుగుతుందన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, కల్పనా కుమారి, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమల్ డీఆర్ఓ జె.వెంకటరావు, ఆర్డీఓ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

వలలో చిక్కిన 19 కిలోల చేప



చేపను చూపిస్తున్న మత్స్యకారుడు

మక్కువ: మండలంలోని శంబర గ్రామం సమీపంలో వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులో శుక్రవారం మత్స్యకారులు వేసిన వలకు భారీ చేప చిక్కింది. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులో మత్స్యకారులు వేట సాగించగా 19కిలోల పెద్ద బొచ్చుచేప జాలారులకు చిక్కింది. ఆ చేపను మక్కువ మార్కెట్లోకి విక్రయించేందుకు తీసుకురాగా స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చేపను రూ.3,200లకు స్థానికులు కొనుగోలు చేశారు.

విద్యార్థుల అవస్థలకు ఆర్టీసీ చెక్

విద్యార్థుల ప్రయాణ కష్టాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఉచిత బస్సు పాసులు, రాయితీపై పాసులు జారీ చేసి వారికి అందుబాటు సమయాల్లో ఆర్టీసీ సర్వీసులు తిరిగే విధంగా చర్యలు చేపట్టింది. దీంతో విద్యార్థులు ఇటు పాఠశాలలు, కళాశాలలకు, తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా గమ్యానికి చేరుకుంటున్నారు.

- ప్రారంభమైన బస్ పాస్‌ల సీజన్
- జిల్లాలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తొమ్మిది బస్సులు
- విద్యార్థుల సులభ ప్రయాణానికి మార్గం

పార్వతీపురం మన్యం జిల్లాలో వివరాలిలా...	
జిల్లాలో ఆర్టీసీ డిపోలు	3
విద్యార్థులకు ప్రత్యేక బస్సులు	9
ఉచిత బస్సు పాసులు సంఖ్య	1800
రాయితీ బస్సు పాసుల సంఖ్య	15,970
జిల్లాలో పాఠశాలల సంఖ్య	1700
విద్యార్థుల సంఖ్య	1,03,733

పార్వతీపురం టౌన్: విద్యార్థుల ప్రయాణ అవస్థలకు చెక్ పెడుతూ జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమయానికి పాఠశాలలకు చేరుకొనే విధంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి విద్యార్థుల గమ్యస్థానానికి చేరుకొనేందుకు మార్గం సులభతరం చేసింది. పాఠశాలల తరగతులు ముగించిన తరువాత సమయానికి ప్రత్యేక బస్సులు ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడకుండా సమయానికి గమ్యస్థానానికి చేరుకుంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులు పాఠశాలలకు ప్రయాణాలు మొదలు పెట్టడంతో ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు పాసులను అందించేందుకు చర్యలు చేపట్టారు. అందుకు అనుగుణంగా పాఠశాల ప్రారంభం నుండి బస్సు పాస్‌లను అందజేస్తున్నారు.

జిల్లాల్లో విద్యార్థులకు ప్రత్యేకంగా 9 బస్సులు

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లో పాఠశాలలు ఎక్కువగా ఉన్నందున వేలాది మంది విద్యార్థుల అవస్థలు తీర్చేందుకు, గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. పార్వతీపురం ఆర్టీసీ డిపో నుండి 3, పాలకొండ నుండి 5, సాలూరు నుండి ఒకటి విద్యార్థుల కోసం పాఠశాల వేళల్లో బస్సులను ఏర్పాటు చేశారు. తద్వారా విద్యార్థులు పాఠశాలలకు చేరుకొనేందుకు మార్గం సులభతరమైంది. అంతేకాకుండా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశం లేకుండా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి సురక్షిత ప్రయాణాన్ని విద్యార్థులకు అందజేస్తున్నారు.

గత ఏడాది 1800 ఉచిత పాసులు

విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యం ఒత్తిడి లేకుండా ఉచితంగా సురక్షిత ప్రయాణం కల్పించడంతో అటు ఆర్థిక భారం, ఇటు ఒత్తిడి లేకుండా జిల్లాలో 1800 ఉచిత బస్సు పాస్‌లను అందజేశారు. జిల్లాలోని 1,03,733మంది విద్యార్థులు ఉండగా అందులో సుమారు 40శాతం మంది గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు విద్యను అభ్యసించిన వారే. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పిస్తూ వారి అవస్థలను తొలగించారు.



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు

15,970 మందికి విద్యార్థులకు రాయితీ పాసులు

12 – 18 ఏళ్లలోపు విద్యార్థులకు 60 శాతం రాయితీతో కూడిన బస్సు పాసులను అందజేస్తున్నారు. ఈ క్రమంలో అర్హులందరికీ ఉచిత బస్సుపాసులు, అర్హత లేని విద్యార్థులకు రాయితీతో కూడిన బస్సులను అందించి విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలను కల్పించేందుకు ఆర్టీసీ దారి చూపుతుంది.

ఇబ్బందుల్లేకుండా..

గతంలో కళాశాలలకు రావాలన్నా, తిరిగి ఇంటికి వెళ్లాలన్నా బస్సులలో నిలబడి వెళ్లేవాళ్లం. ఒక్కోరోజు బస్సులు ఉండకపోవడంతో ఆటోలపై వెళ్లేవాళ్లం. ఇప్పుడు మా కష్టాలన్నీ తీరాయి. మాలాంటి విద్యార్థుల కోసం జగనన్న ప్రభుత్వం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రాయితీతో బస్సు పాస్‌లను అందజేసి సమయానికి ఇంటికి, పాఠశాలలకు, ఇళ్లకు చేరేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు.

– సాయి,
విద్యార్థి, పుట్టూరు, పార్వతీపురం మండలం

సమయానికి చేరుకుంటున్నాం..

కళాశాలల సమయానికి చేరుకుంటున్నాం. ఆర్టీసీ మా ప్రాంతం నుండి పార్వతీపురం పట్టణానికి ప్రత్యేక బస్సును వేశారు. దీనివల్ల ఎటువంటి ఆందోళన లేకుండా సమయానికే పాఠశాలలకు చేరుకుంటున్నాం. పాఠశాల పూర్తయిన తరువాత ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల తరబడి వేచి వుండకుండా సమయానికే బస్సు దొరుకుతుంది. తొందరకు ఇళ్లకు చేరుకుంటున్నాం.

– దేవి ప్రసాద్,
విద్యార్థి, కొత్తపల్లి కురుపాం మండలం

అర్హులందరికీ ఉచిత పాసులు



ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గత ఏడాది జిల్లాలోని మూడు ఆర్టీసీ డిపోల పరిధిలో గల 1800 మంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను అందజేశాం. 15,970 మంది విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లాలోని 9 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఎక్కువగా ప్రయాణించే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలకు అదనపు బస్సులను పంపించేందుకు చర్యలు చేపట్టాం. అందుకు నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

కుంబివలసలో పులి సంచారం



మృతి చెందిన ఆవు

మెంటాడ: ఇప్పుడిప్పుడే పులిని మర్చిపోతున్న మండల వాసులకు మళ్లీ పులి సంచారం ప్రారంభమయ్యిందని తెలిసేసరికి భయభ్రాంతులకు గురవుతున్నారు. గడిచిన రెండు రోజుల కిందట ఆండ్ర పంచాయతీలోని కుంబివలస గ్రామ పొలాల్లో ఆవుపై పులి దాడి చేసి చంపేసిందని అటవీ శాఖ అధికారులకు స్థానికుల ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన సంబంధిత శాఖ అధికారులు ఆవు ఉన్న ప్రాంతాన్ని పరిశీలన చేసి, ఆవుని చంపింది పులే అని నిర్ధారించారు. అయితే ఈ సంఘటన గడిచిన రెండు రోజులు క్రితమే జరిగిందని నిర్ధారించారు. ఈ సందర్భంగా మెంటాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.వి.ఎన్.రాజు మాట్లాడుతూ కుంబివలస గ్రామానికి చెందిన సోములు కొండయ్య అనే గిరిజన రైతుకు చెందిన ఆవు రెండు రోజులుగా కనిపించకపోవడంతో వెతకడం ప్రారంభించాడని, శుక్రవారం ఉదయం నిర్మానుష్య ప్రాంతంలో ఆవు చనిపోయి ఉండటంతో తమకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఆవుని చంపింది బెంగాల్ టైగరేనని, పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చీకటి పడిన తరువాత బయట తిరగరాదని సూచించారు. ఆయన వెంట అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

19న ల్యాబ్ అటెండెంట్ పోస్టుకు కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్, వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్తంగా 194 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టుల్లో ఏర్పడ్డ ఖాళీకి సంబంధించి ల్యాబ్ అటెండెంట్ పోస్టుకు ఈ నెల 19వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు చెప్పారు.

విషాదం నింపిన ప్రేమ



మృతి చెందిన చంద్రన్న

మృతి చెందిన స్వాతి

రైల్వేట్రాక్‌పై పడి ఉన్న ప్రేమికుల మృతదేహాలు

- నిమ్మలపాలెం బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు
- మృతులు అనంతగిరి వాసులుగా గుర్తింపు

శృంగవరపుకోట: పెళ్లయిన వ్యక్తి ఓ బాలికతో నడిపిన ప్రేమ వ్యవహారం వారిద్దరి ఆత్మహత్యకు దారి తీసింది. భార్యాబిడ్డలు ఉన్న ఓ వ్యక్తి బాలికతో నడుపుతున్న ప్రేమ ఇంట్లో తెలిసి కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. భార్య వారి ప్రేమను నిరాకరించింది. భర్త చేస్తున్నది తప్పు అని పదే పదే చెప్పింది. అయినా ఆయన ఆ బాలికను విడవలేకపోయాడు. చివరకు ఆ బాలికతో కలిసి మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చేసేది లేక ఇద్దరూ కలిసి జీవించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించి రైలు కింద పడి ఇద్దరూ తనువు చాలించారు. వివరాల్లోకి వెళ్తే...

విశాఖ జిల్లా అనంతగిరి మండలం తాటిగూడకు చెందిన నందుల చంద్రన్న(33) అదే మండలం సీమగడ్డకు చెందిన సెంబి స్వాతి(17) విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నిమ్మలపాలెం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న బ్రిడ్జి గట్టుపై వీరు తెచ్చిన బ్యాగు ఉన్న తీరు చూస్తే ఆత్మహత్యకు ముందు అక్కడ కొంత సమయం గడిపి ఉంటారని, చనిపోవాలని నిర్ణయించుకున్న తరువాత రైలు కింద పడ ఆత్మహత్యకు పాల్పడినట్టు రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట వీరు ఊరు నుంచి వెళ్లిపోయినట్టు తెలుస్తోందని జీఆర్‌పీ ఎస్ఐ రవివర్మ, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ అర్జున్, ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థలం వద్ద దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించామని చెప్పారు.

రెండు కుటుంబాల్లో...

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రేమ వ్యవహారం రెండు కుటుంబాల్లో తీరని శోకం నింపింది. మండలంలోని తాడిగూడ గ్రామానికి చెందిన చంద్రన్న (33) సీమగెడ్డ గ్రామానికి చెందిన స్వాతి (17) ఆత్మహత్యకు పాల్పడటంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరిద్దరు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాడిగూడ గ్రామానికి చెందిన చంద్రన్నకు పదిహేనేళ్ల క్రితం రొద్దు అనే గిరిజన మహిళతో వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చంద్రన్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న వాలాసి పంచాయతీ సీమగెడ్డ గ్రామానికి చెందిన స్వాతితో గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడు. అయితే రెండో వివాహం చేసుకునేందుకు భార్య రొద్దు అంగీకరించకపోవడంతో భార్యాభర్తలు గొడవపడుతున్నారు. ఈ కారణంగా రెండు నెలల క్రితమే చంద్రన్న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. స్వాతితో కలిసి ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కొత్తవలస మండలం రైల్వే ట్రాక్ వద్ద చంద్రన్న, స్వాతి ఆత్మహత్య చేసుకున్నట్టు కొత్తవలస పోలీసుల నుంచి సమాచారం అందడంతో ఇరు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. చంద్రన్న భార్య గృహిణి. వ్యవసాయం చేసుకుంటూ సాఫీగా సాగిపోతున్న ఆ కుటుంబంలో ప్రేమ వ్యవహారం చిచ్చురేపింది. ఆత్మహత్యకు దారితీయడంతో చంద్రన్న కుటుంబం యజమానిని కోల్పోయింది. భార్య రొద్దు, పిల్లలు కుమార్, సునీల్, సుమిత్ర, దీప్తి అనాధలుగా మిగిలిపోయారు.

బడి బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవీంద్రనాథ్

విజయనగరం క్రైమ్: పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులను తీసుకువెళ్లే ప్రతీ వాహనంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఏ మాత్రం ఫిట్‌నెస్ లేకపోయినా వెంటనే వాటిని సీజ్ చేయాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ జీఆర్.రవీంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. గూడురు నుంచి పదోన్నతిపై జిల్లాకు వచ్చిన ఆయన విజయనగరం డీటీసీగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలో పని చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌టీఓలు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి అధికారి ప్రత్యేక తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు చేపడతామన్నారు. స్కూల్ బస్సులు, కాంట్రాక్ట్ గ్యారేజ్ బస్సుల విషయమై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ప్రమాదాలకు తావీయకుండా చిత్తశుద్ధితో పనిచేసే విధంగా చూడాలన్నారు. జిల్లా నుంచి పలు కంపెనీలకు వెళ్లే బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, వాటితో పాటూ విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోలపై నిశిత దృష్టి కేంద్రీకరించాలన్నారు. అందరి సమష్టి కృషితోనే సాధ్యపడుతుందన్నారు. నూతన డీటీసీగా బాధ్యతలు చేపట్టిన రవీంద్రనాథ్‌ను ఆయన చాంబర్‌లో సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.రమేష్, ఎవి.రమణ, కెఆర్ఎస్.ప్రసాద్, యు.దుర్గాప్రసాద్, ఎంవీఐలు కుమారి వి.శ్రావ్య, ఐశ్వర్య, కార్యాలయ సిబ్బంది అభినందించారు.



డీటీసీగా బాధ్యతలు చేపట్టిన రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు

24న జగనన్న సురక్ష కార్యక్రమం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 24న ప్రారంభించనున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుండి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని, సమస్యలను సంబంధిత పోర్టల్ నందు నమోదు చేయాలని, వాటిపై విచారణ నిర్వహించి, గ్రామంలో పర్యటించే మండల టీం ద్వారా సదరు సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, జనన, మరణ ధ్రువపత్రాలు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్స్, వివాహ సర్టిఫికెట్స్, మ్యుటేషన్లు తదితర సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్స్ జారీ, మ్యుటేషన్లు చేసేటపుడు నిబంధనలు పాటించాలని అన్నారు. మండల స్థాయి, గ్రామ స్థాయిలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు ముందుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి మండలానికి రెండు మండల టీంలను ఏర్పాటు చేయాలని, ఒక టీంలో తహసీల్దారు, ఈఓపీఆర్‌డీ ఇతర సిబ్బంది ఉంటారని, రెండవ టీంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దారు ఇతర సిబ్బంది ఉంటారని, పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనరు, డిప్యూటీ తహసీల్దారు, సిబ్బంది ఉంటారని తెలిపారు. ముందుగా అన్ని గ్రామాలలో సేవలను అందించేందుకు వీలుగా ముందుగా షెడ్యూలు రూపొందించుకోవాలని, దాని ప్రకారం మూడు రోజులు ముందుగా ఆయా గ్రామాలలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సర్వీసు పోర్టల్‌లో రిజిస్ట్రేషను చేసి, విచారణ అనంతరం మండల టీంచే సర్టిఫికెట్స్ జారీ, సమస్యల పరిష్కారం చేయాలని తెలిపారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23వ తేదీన ప్రారంభిస్తున్నారని, 24వ తేదీన జిల్లాలో ప్రారంభమవుతుందని, కావున దాని ప్రకారం షెడ్యూలు తయారుచేసి 24వ తేదీన మండల టీంలు పర్యటించే విధంగా గ్రామాలలో మూడు రోజుల ముందు నుండి కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని గ్రామం టీం సందర్శించాలని, జిల్లా నుండి ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని, ఎక్కడైనా గ్రామ బృందాలు ఏ ఇంటినైనా సందర్శించలేదని తమ దృష్టికి వస్తే సదరు గ్రామ సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జాయింటు కలెక్టర్ ఆర్.గోవిందరావు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

త్వరగా స్టోన్ ప్లాంటేషన్ పనులు

పార్వతీపురం: మొదటి విడత రీసర్వే పూర్తయిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుండి మండల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన సమీక్ష సమావేశంలో రీసర్వే, ఎన్‌సీడీ సర్వే, రిజిస్ట్రేషన్లు, ఈ క్రాప్ బుకింగ్, విత్తనాల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని, దాని ప్రకారం అక్టోబర్ నెల నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. మొదటి విడత పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 25 నుంచి రిజిస్ట్రేషన్లు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వే త్వరగా పూర్తి చేయాలని, సర్వే ఎంతవరకు జరిగినది నివేదిక అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ జూలై 1 నుండి ఈ–క్రాప్ బుకింగ్ మొదలు పెట్టాలని, సెప్టెంబరు 1 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. రాగి, కందులు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన గింజ ధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాధరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గెడ్డలోకి కారు బోల్తా



బోల్తా పడిన కారు

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని డైట్ కాలనీలో గల గెడ్డలోకి శుక్రవారం ఓ కారు బోల్తా పడింది. కొండవెలగాడ రోడ్డు నుంచి నెల్లిమర్ల వస్తున్న కారు డైట్ కాలనీ మలుపు వద్ద అదుపు తప్పడంతో గెడ్డలోకి బోల్తా పడింది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. మూడురోజుల క్రితం కూడా ఇదే ప్రదేశంలో ఓ కారు బోల్తా పడి, గెడ్డలోకి దూసుకుపోయింది. గతంలో కూడా పలుమార్లు ఇలాంటి ప్రమాదాలే సంభవించాయి. మలుపు ప్రమాదకరంగా ఉండడం, పక్కనే గెడ్డ ఉండడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అప్పు తిరిగి ఇమ్మన్నందుకు దాడి



చికిత్స పొందుతున్న పి.సంతోష్

పార్వతీపురం: తనకు రావల్సిన డబ్బు అడిగినందుకు కొట్లాట జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని చిన్నదేవర వీధికి చెందిన పి.సంతోష్ గతంలో ఆర్టీసీలో హెల్పర్‌గా పనిచేసిన బి.సంతోష్‌కు రూ.1000 అప్పు ఇచ్చాడు. ఈ మేరకు గతంలో ఇచ్చిన నగదును ఇమ్మని గురువారం రాత్రి పాత బస్‌స్టాండ్‌వద్ద ఉన్న బి.సంతోష్‌ను అప్పు ఇచ్చిన పి.సంతోష్ అడగగా ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. దీంతో అప్పు ఇచ్చిన పి.సంతోష్‌ను పలుచోట్ల బి.సంతోష్ కొట్టి సెల్‌కూడా లాక్కున్నాడు. ఈ నేపథ్యంలో పి.సంతోష్‌కు చికిత్స కోసం కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రిలో చేర్చారు.

నిద్ర లేపినందుకు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఆశ

పార్వతీపురం: నిద్రిస్తున్న తనను తల్లి లేపినందుకు కుమార్తె మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రెల్లివీధికి చెందిన ఎస్.ఆశ ఉదయం ఎనిమిది గంటలైనా నిద్రనుంచి లేవకపోవడంతో తల్లి సుజాత తిట్టి లేపింది. అందుకు కుమార్తె చిరాకు పడడంతో పాటు మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న చీమల మందును తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

5 వ్యాన్‌ల సీజ్



బొండపల్లి: మండలంలోని జాతీయ రహదారి26 మీదుగా 5 బొలెరో వ్యాన్‌లలో పశువులను తరలిస్తుండగా పోలీసులు 5 వ్యాన్‌లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి మూడు వ్యాన్‌ల్లోను, అలాగే మానాపురం నుంచి రెండు వ్యాన్‌లలో 35 పశువులను అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. ఈమేరకు వ్యాన్ డ్రైవర్లను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంసద్ ఆదర్శ్ గ్రామయోజనకు....

ఐదు గ్రామాల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపీ మాధవి

పార్వతీపురం: సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమం క్రింద పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐదు గ్రామాలను దత్తత గ్రామాలుగా ఎంపిక చేశారని అరకు పార్లమెంట్ నియోజకవర్గ సభ్యురాలు (ఎంపీ) గొడ్డేటి మాధవి తెలిపారు. సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమంపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మాధవి మాట్లాడుతూ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన పథకం కింద గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన ఐదు గ్రామాలు దేశంలోనే ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. గ్రామాల్లో అందరు విద్యార్థులు బడిలో ఉండడం, యువతకు మంచి అవకాశాలు కల్పించడం తదితర కార్యక్రమాలను చేపట్టడంలో ముందుండాలని ఆమె కోరారు.

పథకాలు వినియోగించుకుంటూ లక్ష్య సాధన

కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలపై నిశిత దృష్టి సారించి పథకాలు వినియోగించుకోవడం ద్వారా లక్ష్యాలు సాధించగలమన్నారు. మంచి సంకల్పం ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జూన్ 25 నాటికి గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, నోడల్ అధికారి డాక్టర్ ఎం.అశోక్ కుమార్ కార్యక్రమం వివరాలు తెలిపారు. గ్రామాల్లో వ్యక్తిగత ప్రవర్తన-పరిశుభ్రత పాటించడం, మద్యపానం, ధూమపానం నిషేధం, ఆరోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టడం, మానవ అభివృద్ధి-విద్య, వైద్యం, పౌష్టికాహారం పొందడం, ఆర్థిక, పర్యావరణ, సామాజిక అభివృద్ధి, సుపరిపాలన, ప్రాథమిక సౌకర్యాలు, సేవల కల్పన రంగాల్లో కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఎంపికైన గ్రామాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో నర్సిపురం (పార్వతీపురం మండలం), నీలకంఠాపురం (కురుపాం), కన్నపుదొర వలస (జియ్యమ్మవలస), ఇసుకగెడ్డ (సీతంపేట), పాచిపెంట (పాచిపెంట) గ్రామాలను సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమం క్రింద గుర్తించారని చెప్పారు. ఈ గ్రామాలకు ఇన్‌చార్జ్ అధికారులుగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు (నర్సిపురం), జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ (నీలకంఠాపురం), జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ కన్నపుదొరవలస, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు (ఇసుకగెడ్డ), జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ (పాచిపెంట)ను నియమించామని చెప్పారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి జీవీపీ ప్రసూన, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బగాది జగన్నాథ రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, సంబంధిత సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహమంటే ఇదేరా..!

అలల ప్రయాణం తీరం చేరేంత వరకు మాత్రమే. కలల ప్రయాణం నిద్ర లేచేంతవరకు మాత్రమే. ప్రేమ ప్రయాణం పెళ్లి జరిగేంత వరకు మాత్రమే. కానీ స్నేహబంధం ప్రాణం పోయేంత వరకు అని నిరూపించారు ఈ ప్రాణస్నేహితులు. నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామానికి చెందిన ప్రాణస్నేహితులు 24 గంటల వ్యవధిలో మృతిచెందారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.

- 24 గంటల వ్యవధిలోనే ప్రాణ స్నేహితుల మృతి



సారిపల్లి చిట్టిబాబు(ఫైల్)



బోనుమహంతి నరసింగరావు(ఫైల్)

నెల్లిమర్ల: వారిద్దరూ ప్రాణ స్నేహితులు. ఊహ తెలిసిన నాటి నుంచి ఆధ్యాత్మిక సేవలోనే గడిపారు. కలిసి భజనలు చేసి పాటలు పాడారు. ఇద్దరిలో ఒకరు అనారోగ్యంతో చనిపోయిన 24 గంటల్లోగానే రెండో వ్యక్తి మృతిచెందాడు. సారిపల్లి గ్రామానికి చెందిన సారిపల్లి చిట్టిబాబు(70), బోనుమహంతి నరసింగరావు(70) ఊహ తెలిసిన నాటి నుంచి గ్రామంలో ఆధ్యాత్మిక సేవలను అందిస్తూ వచ్చారు. శ్రీరామకృష్ణ మఠం స్థాపనలో ఇద్దరి కృషి అభినందనీయం. గ్రామంతో చుట్టుపక్కల ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా చురుగ్గా పాల్గొనేవారు. భక్తి పాటలు పాడడం, ప్రసంగాలు చేయడంలో ఇద్దరికీ మంచి పేరుంది. వినాయక ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో వీరి ఆధ్యాత్మిక సేవ ప్రశంసనీయం. ఈ నేపథ్యంలో చిట్టిబాబు అనారోగ్యానికి గురికావడంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మిత్రుడి మరణవార్త విన్న క్షణం నుంచి నరసింగరావు కూడా కలత చెందాడు. మిత్రుడి మరణ వార్త ఆయనను మానసికంగా కుంగదీసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఆయన కూడా మృతిచెందాడు. ప్రాణస్నేహితులు ఇద్దరూ 24 గంటల వ్యవధిలోనే మృతిచెందడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. మరణంలోనూ వారు స్నేహం వీడిపోలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

హర్ దిల్‌మే వైఎస్సార్..హమ్ సబ్ జగన్‌కే సాథ్

- కరపత్రాలను ఆవిష్కరించిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



కరపత్రాలను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన హర్ దిల్ మే వైఎస్సార్..హమ్ సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ముస్లిం సెల్ ప్రతినిధులు మజ్జి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ముస్లిం సోదరులంతా రానున్న ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ముస్లిం సోదర సోదరీమణులకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింల సంక్షేమాన్ని పట్టించుకునే నాథుడే లేడన్న విషయాన్ని గుర్తు చేశారు. గడిచిన 4 ఏళ్లలో మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం సోదరులంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐ.ఏ ఫరూక్, మైనార్టీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ బర్కత్ అలీ, విశాఖపట్నం వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు బాబా, విజయనగరం జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, జాకీర్ పాల్గొన్నారు.

ఆర్మీలో కొలువు సాధించాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



అభ్యర్థులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: అగ్నివీర్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జిల్లా వేదికగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అభ్యర్థులు కొలువులు సాధించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వచ్చే నెలలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల మైదానంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొనబోయే అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో పాల్గొనే అర్హులైన అభ్యర్థులకు శుక్రవారం ఆయన ప్రదీప్ నగర్‌లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉచితంగా టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని చక్కటి వేదికగా వినియోగించుకోవాలని సూచించారు. సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ మాట్లాడుతూ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ శిబిరం నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిక్షకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పశు సంవర్ధకశాఖ జేడీ విశ్వేశరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ విశ్వేశరరావు

గంట్యాడ: పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వేశరరావు అన్నారు. మండలంలోని గింజేరు గ్రామంలో పశుబీమా పథకంపై పాడి రైతులకు శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, దుక్కి దున్నే పశువులకు బీమా చేసుకోవచ్చునని తెలిపారు. తెల్లకార్డు కలిగిన రైతులకు 80 శాతం రాయితీ, తెల్లకార్డు లేని వారికి 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. వ్యాధి వల్ల, ప్రమాదం, ప్రకృతి వైపరీత్యాల వల్ల చనిపోయిన పశువులకు బీమా పొందవచ్చునని తెలిపారు. పశువులకు చికిత్స కోసం వైఎస్సార్ సంచార పశు వైద్యశాలలను వినియోగించుకోవాలని సూచించారు. పశువుల చికిత్స కోసం టోల్ ఫ్రీ నంబర్ 1962ను సంప్రదించాల న్నారు. కార్యక్రమంలో డీడీ వై.వీ.రమణ, ఎ.డి రెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా రైతులకు శిక్షణ

- చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన



రస్తాకుంటుబాయి కేవీకేలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఒడిశాకు చెందిన గిరిజన రైతులు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం)లో ఒడిశాకు చెందిన 30 మంది గిరిజన రైతులకు (ఒడిశా మిల్లెట్ మిషన్ ఆధ్వర్యంలో) చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 12న చేపట్టిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో మాట్లాడుతూ శిక్షణలో కేవీకే ముఖ్య ఉద్దేశాలు, కేవీకేలో ఉన్న డెమో యూనిట్లపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. అలాగే వివిధ రకాల చిరుధాన్యాల (కొర్ర, సామ, ఊద,అరిక, అండు కొర్రలు, రాగులు) పంటల సాగుతో ప్రయోజనాలు, పంటల సాగులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై క్షుణ్ణంగా తెలియజేశామన్నారు. అలాగే చిరుధాన్యాలతో సుమారు 15 రకాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ ఎం.అనంత విహారి, డాక్టర్ జి.అను, వై. ఉమాజ్యోతి ఉన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మండలంలోని ఆనందపురం వద్ద ఎస్సై హరిబాబు నాయుడు శుక్రవారం పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించడంతో ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఈ మేరకు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్ల పట్టివేత

వీరఘట్టం: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై మైనింగ్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేసి మట్టి తవ్వుతున్న జేసీబీ, మట్టితో ఉన్న రెండు ట్రాక్టర్లు పట్టుకుని సీజ్ చేశారు. వీరఘట్టం మండలం కడకెల్ల వద్ద పొలం మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా మైన్స్ ఎ.డి శ్రీనివాసరావు,టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబులు అడ్డుకున్నారు. ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

విశాఖలో అంతర్ జిల్లా న్యాయవాదుల క్రికెట్ టోర్నీ

విజయనగరం లీగల్: అంతర్ జిల్లా న్యాయవాదుల క్రికెట్ టోర్నీకి జిల్లా న్యాయవాదుల సంఘానికి చెందిన 16 మంది క్రీడాకారులు శుక్రవారం విశాఖ బయల్దేరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణచక్రవర్తికి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చొక్కాపు దాము క్రీడాకారులను పరిచయం చేశారు. కేవలం వృత్తికే పరిమితం కాకుండా మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గనాలని ప్రధానన్యాయమూర్తి వారికి సూచిస్తూ టోర్నీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం నిర్వహిస్తున్న ఆహ్వాన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జట్లు తలపడనున్నాయి.జిల్లా కేంద్రం నుంచి ఎల్.శంకర రావు కెప్టెన్సీలో 13 మంది క్రీడకారులతో పాటు సంఘం అధ్యక్షుడు చొక్కాపు దాము, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పాడుగుకుమార్ వెళ్లారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తికి క్రీడాకారులను పరిచయం చేస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దాము

నేడు ఆణిముత్యాలుకు సన్మానం

- జిల్లా స్థాయిలో 52 మందికి పురస్కారాలు
- హాజరు కానున్న మంత్రి బొత్స సత్యనారాయణ



బి లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

విజయనగరం ఫూల్‌బాగ్: మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారికి ప్రోత్సాహాన్ని అందించడం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫలితాలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా రూపొందించిన ×జగనన్న ఆణిముత్యాలు× కార్యక్రమం శనివారం జిల్లా స్థాయిలో జరగనుంది. విజయనగరం పట్టణంలోని కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులను సన్మానించనున్నారు. మొత్తం 32 మంది పదోతరగతి విద్యార్థులు, 20 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు మంత్రి చేతులమీదుగా సన్మానం పొందనున్నారు. ఇప్పటికే పాఠశాల, నియోజకవర్గ స్థాయి ఆణిముత్యాలు సన్మాన కార్యక్రమాలు దాదాపు పూర్తయ్యాయి. విజయనగరం పట్టణంలోని కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తామని డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు.

అరటి తోటలో మృతదేహం



తోటలో గొర్రెల కాపరి మృతదేహం

దత్తిరాజేరు: మండల కేంద్రం దత్తిరాజేరు గ్రామ సమీపంలో ఉన్న అరటి తోటలో మెంటాడ మండలం పెదమేడపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోన సింహచలం(49) మృతదేహం లభ్యమైనట్లు పెదమానాపురం ఎస్సై జి.శిరీష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ దత్తి వెంకటాపురం గ్రామానికి చెందిన గొర్రెల యజమాని గడిదేశి సూరయ్య వద్ద ఏడాదిగా సింహాచలం పని చేస్తున్నాడని, ఈనెల 14వ తేదీ నుంచి కనిపించక పోవడంతో కుటుంబసభ్యులకు యజమాని సమాచారం అందించి ఎక్కడున్నాడో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం అరటి తోటలో మృతదేహం ఉందని స్థానికులు సమాచారం అందించడంతో వెళ్లి మృతదేహన్ని బయటకు తీసి గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మద్యం మత్తులో మృతి చెందాడా? ఇతర కారణాలతో మృతి చెందాడా? తెలియాల్సి ఉందన్నారు.మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



లక్ష్మునాయుడు (ఫైల్)

చికిత్స పొందుతూ ఉపసర్పంచ్..

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామ ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు (65) విజయనగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం ఉదయం క్రిమి సంహారక మందు తాగిన లక్ష్మనాయుడిని కుటుంబసభ్యులు విజయనగరం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య సత్తెమ్మ, బ్యాంకుల్లో ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు కుమారులు, అమెరికాలో ఉంటున్న కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670-00
బంగారం(22సి. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	77,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹155	₹280	₹ 290